క్లుప్తంగా

పెదిరిపాడ్ విద్యార్థుల విజ్ఞానయాత్ర



మద్దూరు: మండలంలోని పెందిరిపాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం చెవెళ్ల శివారులోని ఎక్స్‌పీరియం పార్కును సందర్శించారు. ప్రాజెక్టు ఇన్నోవేషన్‌లో భాగంగా 150 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఎక్స్‌పీరియం పార్కులో అరుదైన మొక్కల వివరాలను విద్యార్థులు తెలుసుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం బాలకిష్టప్ప తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్, ఎకో సిస్టంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు రాజేంద్రకుమార్, నాగార్జునరెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భాస్కర్, శబరి, రాజు, రవీందర్‌రెడ్డి, రవీందర్ నాయక్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం



మరికల్: మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వెంకటరాంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీపరంగా అండగా ఉంటామని.. అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. ఆయన వెంట జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ సురేఖ, బసంత్, సంపత్, రవి, రామస్వామి, తిరుపతయ్య, హన్మిరెడ్డి, మతీన్ తదితరులు ఉన్నారు.

తీరిన లోఓల్టేజీ సమస్య



కోస్గి: పట్టణంలోని 14వ వార్డు ప్రజలు కొంతకాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ లోఓల్టేజీ సమస్య ఎట్టకేలకు తీరింది. శనివారం కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఇద్రీస్ మాట్లాడుతూ.. కడా చైర్మన్ వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మెన్లు శ్రీనివాస్, రాంచందర్ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలి

నారాయణపేట రూరల్: విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయ్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ మణెమ్మ, డీఎస్‌ఓ భానుప్రకాష్ ఉన్నారు.

నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్

నారాయణపేట: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపు భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ వడ్ల శ్రీకాంత్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో బాలాజీ స్టీల్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికాట్ గ్రూప్ కంపెనీస్ 13 దేశాల్లో విస్తరించి ఉన్నాయని తెలిపారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి సిమెంట్ నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని అన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారన్నారు. అనంతరం మేస్త్రీలందరికీ రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. సమావేశంలో మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ భరత్ కుమార్, డీలర్ వి.లక్ష్మణ్ పాల్గొన్నారు.



అర్హులందరికీ రేషన్‌కార్డులు

- అన్ని గ్రామాల్లో చౌకధర దుకాణాలను ఏర్పాటు చేస్తాం
- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



గొల్లపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మక్తల్ మండలంలోని మాధన్‌పల్లి, ఎర్నాగన్‌పల్లి, టేకులపల్లి, గుర్లపల్లి గ్రామాల్లో చౌకధర దుకాణాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. గొల్లపల్లిలో రూ. 15లక్షలతో సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మంతన్‌గోడ్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. మంతన్‌గోడ్‌లో రూ. 5లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 52 గ్రామాల్లో చౌకధర దుకాణాలు లేకపోవడంతో లబ్ధిదారులు అవస్థలకు గురవుతున్నారని, అన్ని గ్రామాల్లో చౌకధర దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలకు ఆరు గ్యారంటీలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతుందన్నారు. మక్తల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గణేష్ కుమార్, ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ తహసీల్దార్ పుష్పలత, డీలర్ చంద్రశేఖర్, హెచ్‌ఎం ఖాజా అమీరుద్దీన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ స్వప్న, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, ఆనంద్, ఆనంద్‌గౌడ్, శ్రీనివాసులు, కృష్ణయ్య, అనురాధ, రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వన్ నేషన్ - వన్ రేషన్‌పై అవగాహన



రేషన్ డీలర్లకు సూచనలు చేస్తున్న ఎన్‌ఐసీ అధికారి అన్నపూర్ణ

మరికల్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన్ నేషన్–వన్ రేషన్ విధానంపై శనివారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఐసీ అధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా రేషన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. వన్ నేషన్–వన్ రేషన్ విధానంతో ఎలాంటి సమస్య ఉండదన్నారు. లబ్ధిదారులు దేశంలోని ఎక్కడి నుంచైనా సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. కాగా, ఈపాస్ మిషన్ ఆపరేటింగ్‌లో తలెత్తుతున్న సమస్యలను డీలర్లు అధికారి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో విజన్ టెక్ మేనేజర్ శ్రీధర్, డీటీ కాశప్ప, ఆనంద్, గురురాజారావు, భాస్కర్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ ఆశయాలు కొనసాగిద్దాం



ఊట్కూరు: ఛత్రపతి శివాజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నేత బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నపొర్లలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు శనివారం రూ. 75వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత పాశ్చాత్య సంస్కృతికి ఆకర్షితులై జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు, యువత దేశభక్తి, దైవభక్తి పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఛత్రపతి శివాజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆయన విగ్రహాన్ని మారుమూల గ్రామంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్, మోహన్, రాజు, నర్సింహ పాల్గొన్నారు.

వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయండి



మాట్లాడుతున్న డీపీఓ కృష్ణ

మద్దూరు: అన్ని గ్రామపంచాయతీల్లో వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని డీపీఓ కృష్ణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి మద్దూరు మండల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్తిపన్ను వసూళ్ల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని వనమహోత్సవం మొక్కలకు క్రమం తప్పకుండా నీరందించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ రామన్న తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక



మరికల్: మండలంలోని అప్పంపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుడు దండు మల్లారెడ్డి శనివారం ఎంపీ డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కేంద్రం ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తోడ్పాటు అందించాలి



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఉపాధ్యాయులు

ధన్వాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు తోడ్పాటు అందించాలని ఎంఈఓ గాయత్రి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ఖాళీ కడుపుతో ప్రత్యేక తరగతులకు వస్తున్నట్లు గుర్తించిన పాఠశాల హెచ్‌ఎం నరసింహాచారి.. తన సొంత డబ్బుతో అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. 25 రోజులపాటు 122 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని.. అప్పటి వరకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. దాతలు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉమేష్, నాయకులు వెంకటేష్, సత్యనారాయణగౌడ్, రామచంద్రయ్య, లక్ష్మయ్యగౌడ్, రహీమాన్‌ఖాన్, రాఘవేందర్‌రెడ్డి, సూరిగౌడ్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్, అచ్చిబాబు, నర్సింహులు, రాజు, బాలరాజు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలి



మాట్లాడుతున్న సీడీపీఓ వెంకటమ్మ

నారాయణపేట రూరల్: అంగన్‌వాడీ టీచర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటమ్మ అన్నారు. మండలంలోని జాజాపూర్ రైతువేదికలో శనివారం అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు విధిగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. ప్రీ స్కూల్ అక్టివిటీస్ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. చిన్నారుల హాజరు పట్టిక విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ఎప్పటికప్పుడు సీడీపీఓ కార్యాలయానికి రిపోర్టులు పంపించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల గదులు, ఇతర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గీత, అంజలి, చంద్రకళ, సరోజ, రాజేశ్వరి, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ నర్సింహ పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్రానికి పాదయాత్ర



ఊట్కూరు: మండల కేంద్రంలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో శనివారం గురుస్వామి ప్రభు ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివస్వాములు ఇరుముడిధారణ గావించి శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. అంతకుముందు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివస్వాములు ఆంజనేయులు, వెంకటప్ప, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

కనులపండువగా గిరిజా కల్యాణం



గిరిజా కల్యాణ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అమరచింత: మండల కేంద్రంలోని శ్రీకృష్ణానగర్‌లోని పాత శివాలయంలో శనివారం గిరిజా కల్యాణం కనులపండువగా నిర్వహించారు. శుక్రవారం శివ మహాపడిపూజ నిర్వహించిన మాలధారులు శనివారం గిరిజా కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. శివ, పార్వతుల ఉత్సవ విగ్రహాలతో వధువరులను భక్తులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ పూజారి జంగం శివానంద్, మాలధారులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం



మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వడ్ల స్వప్నను శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సన్మానించి అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఆమె శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌కుమార్, తహసీల్దార్ పుష్పలత, గణేష్‌కుమార్, శ్రీనివాసులు, కృష్ణయ్యగౌడ్, కృష్ణయ్య, శ్రీనివాసులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భావన

మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి భావన అన్నారు. శనివారం మండలంలోని రామచంద్రాపూర్ గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, వేధింపులకు గురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, బాలకార్మిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం జడ్జి భావనను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, న్యాయవాది రవికుమార్‌యాదవ్, గ్రామ పెద్దలు ఆనంద్ బిన్ని, వీరన్న పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి



నారాయణపేట మండలం ఊటకుంటతండాలో సేవాలాల్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

నారాయణపేట రూరల్/మద్దూరు/కోస్గి రూరల్/కొత్తపల్లి: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నారాయణపేట మండలంలోని ఊటకుంటతండా, పేరపళ్లమీది తండా, కొల్లంపల్లి తండాల్లో గిరిజనులు సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో రామునాయక్, సీతమ్మ, వెంకట్‌నాయక్, కిషన్ నాయక్, చందర్, శంకర్, రవి, వేపూరి రాములు, జన్యానాయక్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు మండలం పల్లెగడ్డతండాలో..

- మద్దూరు పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా పల్లెగడ్డతండా సేవాలాల్ భవన నిర్మాణ స్థలం వరకు గిరిజన నాయకులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన యువత సంప్రదాయ నృత్యాలతో హోరెత్తించారు. అక్కడ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి భోగ్‌బండార్ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, రవినాయక్, అనిల్, లక్ష్మణ్, కృష్ణ, యుద్ధం, రమేష్, నాగేష్, పాండు, బలరాం, ఉపేందర్ పాల్గొన్నారు.
- కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, భానునాయక్, కృష్ణ, రాజేష్, రాము, బాలునాయక్ పాల్గొన్నారు.
- కొత్తపల్లి మండల కేంద్రంలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు లాల్యానాయక్, భీమ్యానాయక్, సూర్య, గోవిందు, లక్ష్మణ్, పాండు, రాజు పాల్గొన్నారు.



కొత్తపల్లి మండల కేంద్రంలో..



కోస్గి పట్టణంలో..

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ధర్నా



అధికారికి వినతిపత్రం అందిస్తున్న టీయూసీఐ నాయకులు

కోస్గి రూరల్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం టీయూసీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ.. గత సెప్టెంబర్ నుంచి బిల్లులు, గౌరవ వేతనాలు రాకపోవడంతో కార్మికులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రతినెలా బిల్లులతో పాటు గౌరవ వేతనం రూ. 21వేలు చెల్లించాలని, ప్రభుత్వమే కోడిగడ్లను సరఫరా చేయాలని, వంట పాత్రలు అందించాలని, కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకులు రాములు, అంజమ్మ, సుశీల, సద్గుణ, ఎల్లమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



ఎడివెల్లి పాఠశాల విద్యార్థులతో నర్సింహులు

ఊట్కూరు: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ నర్సింహులు అన్నారు. మండలంలోని ఎడివెల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్య అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం దుస్తులు అందిస్తున్నట్లు చెప్పారు. పిల్లలను తప్పనిసరిగా చదివించాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులకు పంపించవద్దని సూచించారు. ఎవరైనా బాలలను పనుల్లో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా బాల్యవివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని తెలిపారు. ఎవరైనా బాల్యవివాహం చేస్తున్నట్లు తెలిస్తే 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవి, వెంకటప్ప, అనీల్, రమేష్ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం



మద్దూరులో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు



మాగనూర్ ఎంపీడీఓ కార్యాలయంలో..

మాగనూర్: త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మండలంలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీఓ రహమ్మతుద్దీన్ తెలిపారు. మండలంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటర్ల జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో ఏడు ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి గాను 38 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. వీటిపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో తుది జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు.

మద్దూరులో 40 పోలింగ్ కేంద్రాలు..

మద్దూరు: మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానం కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటర్ల జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రదర్శించారు. మండలంలోని 28,087 ఓటర్లు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పాల్గొంటారని ఎంపీడీఓ నర్సింహారెడ్డి తెలిపారు. వీరి కోసం 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎంపీఓ రామన్న తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించొద్దు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ బాలాజీ

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ బాలాజీ అన్నారు. శనివారం మండలంలోని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు లేకుండా వంట చేయరాదన్నారు. వంట పాత్రలు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ భానుప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.